క్లుప్తంగా

నిరుపేద విద్యార్థినికి సైకిల్ వితరణ



భవ్యశ్రీకి సైకిల్ అందజేస్తున్న ఉపాధ్యాయిని నిర్మలా రాణి

మునగపాక : తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయురాలు నిర్మలా రాణి మానవత్వాన్ని చాటుకున్నారు. నిర్మలా రాణి జన్మదినం సందర్భంగా కలం కానుక ట్రస్ట్ ద్వారా శనివారం తోటాడ హైస్కూల్లో 9వ తరగతి చదువుకుంటున్న మూలపేటకు చెందిన నిరుపేద విద్యార్థిని ఐ.భవ్యశ్రీకి రూ.5,500 విలువ చేసే సైకిల్‌ను అందజేసి మానవత్వం చాటుకున్నారు. 2017 నుంచి నిర్మలా రాణి కలం కానుక ట్రస్ట్ ద్వారా ఏటా తన పుట్టిన రోజును పురస్కరించుకొని సేవా కార్యక్రమం చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్నారు.

కొండకర్లలో నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

మునగపాక : అచ్యుతాపురం మండలం కొండకర్లలో ఈ నెల 11న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఏవీఎస్ మూర్తి, పీవీ గిరిబాబులు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1986–87వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఈ సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

ఆలయ నిర్మాణానికి ఎంపీపీ విరాళం



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : మునగపాకలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి శనివారం రూ.లక్షా వెయ్యినూట పదహార్లు విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణంలో భాగంగా దాతలు తమవంతు సాయం అందజేస్తూ వస్తున్నారు. ఆలయ నిర్వాహకులకు ఆమె తన విరాళం అందజేశారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర కోరారు. గంగాదేవిపేటలో శనివారం ఏర్పాటు చేసిన 104 సేవలను ఆమె సందర్శించారు. ఎస్‌హెచ్‌ఎం యామిని, ఏఎన్‌ఎం రమణి, ఆరోగ్య సహాయకులు విశ్వనాథ పాల్గొన్నారు.

ఓపీఎస్‌కే మా మద్దతు



ఓపీఎస్‌కే తమ ఓటని తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

యలమంచిలి రూరల్ : పాత పింఛను విధానం(ఓపీఎస్)కే తమ మద్దతు అని యలమంచిలి శాఖ యూటీఎఫ్ నాయకులు మరోసారి పునరుద్ఘాటించారు. శనివారం భోజన విరామ సమయంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమాన్ని తెలియజేశారు. తమ విన్నపాన్ని ప్రభుత్వం సానుకూలంగా స్వీకరించి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఐటీ విభాగం జిల్లా కన్వీనర్ మళ్ల కాలేశ్వరరావు కోరారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండలంలోని వాడ్రాపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు యల్లపు రాజేశ్వరరావు, భార్గవాచార్యులు, మళ్ల మల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు సంపూర్ణ హక్కు

- జగనన్న ఇళ్ల పట్టాలపై సంపూర్ణ హక్కు కల్పిస్తున్న ప్రభుత్వం
- సచివాలయాల్లో జోరుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



యలమంచిలి పురపాలక సంఘ కార్యాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఇది కదా అభివృద్ధి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి రూరల్ : పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. సొంతింటి కల సాకారం చేసేందుకు పక్కా గృహాలు మంజూరు చేసింది. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం చేపట్టింది. యలమంచిలి మున్సిపాలిటీలో అన్ని సచివాలయాల వద్ద రిజిస్ట్రేషన్ల కోలాహలం కనిపిస్తోంది. పేదలందరికీ ఇళ్లు పథకంలో నిరుపేద కుటుంబాలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడమే కాకుండా సదరు స్థలంపై వారికి సంపూర్ణ హక్కు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాని వాటిపై హక్కు కల్పించిన దాఖలాలు లేవు. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలపై హక్కు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. గత ప్రభుత్వాలు ఇళ్ల పట్టాలు ఇచ్చినా ప్రభుత్వానికి వాటిని రద్దు చేసే అధికారం ఉండేది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా లబ్ధిదారులకు యజమానులుగా హక్కు కల్పిస్తున్నారు.

802 రిజిస్ట్రేషన్లు

ప్రస్తుతం పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సచివాలయాల్లో జోరుగా సాగుతోంది. యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో 13 సచివాలయాల్లో 1310 ఇళ్ల స్థలాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు ఆ స్థలంపై హక్కు కల్పిస్తూ ఈ నెల 2వ తేదీ నుంచి అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టారు. ఇప్పటి వరకూ 802 రిజిస్ట్రేషన్లు జరిపారు.

సచివాలయ కార్యదర్శి, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్ లబ్ధిదారుని ఈకేవైసీ ద్వారా రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసి దస్తావేజులను లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తున్నారు. పత్రాలు అందుకుంటున్న నిరుపేదల కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది. యజ్ఞంలా చేపడుతున్న ఈ ప్రక్రియపై వివిధ స్థాయిల్లో అధికారులు రోజువారీ పురోగతిని సమీక్షిస్తున్నారు.

ఏ ప్రభుత్వమూ చేయని సాయమిది



ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం చేయని సాయం జగనన్న ప్రభుత్వం చేసి చూపించింది. ఇంటి స్థలంపై సంపూర్ణ హక్కు కల్పించి ప్రతి మహిళని యజమానిగా చేశారు. మాకు యలమంచిలి పట్టణ పరిధిలో ఇచ్చిన స్థలానికి రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందించారు. సీఎం జగన్ వల్లే మాలాంటి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి.

–మంజేటి శిరీష, ధర్మవరం

ఆనందంగా ఉంది...



మాలాంటి పేదలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోంది. నవరత్నాలు పేరిట ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. నాకు మర్రిబంద లేఅవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చారు. ఇపుడు ఆ ప్లాటును రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. మాకంటూ ఒక స్థిరాస్తిని కల్పించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. పేదలంతా కచ్చితంగా జగనన్నకు మద్దతుగా నిలుస్తారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

–కోసూరి చంద్రమ్మ, కొత్తపేట

ప్రతి దళిత వాడను పంచాయతీ చేయాలి

- ఏటా రూ.2 కోట్లు కేటాయించాలి
- కుల గణన పూర్తయితే చేస్తామని సీఎం హామీ ఇచ్చారు
- మిగిలిన పార్టీలు కూడా మేనిఫెస్టోలో చేర్చి ప్రకటన చేయాలి
- ఎయిమ్ వ్యవస్థాపకుడు, అడిషనల్ డీజీపీ సునీల్ కుమార్
- పాయకరావుపేటలో రాష్ట్ర స్థాయి దళిత సదస్సు



సభలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

నక్కపల్లి /పాయకరావుపేట : రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి జనాభా దాటిన ప్రతి దళిత వాడను ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని, అభివృద్ధి పనుల కోసం ఏటా రూ.2 కేటాయించాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర వ్యవస్థాపకుడు, ఏపీ అడిషనల్ డీజీపీ(ఫైర్ సర్వీసెస్) పి.వి.సునీల్‌కుమార్ కోరారు. శనివారం పాయకరావుపేటలో అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో దళితవాడ సాధన సంకల్ప సభ జరిగింది. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి దళితులంతా తరలివచ్చారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా అడిషనల్ డీజీపీ సునీల్ కుమార్ హాజరయ్యారు. ఆయనను పాయకరావుపేట పట్టణంలో ఘనంగా ఊరేగిస్తూ సభావేదిక వద్దకు తీసుకువచ్చారు. వేదిక వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ దేశ జనాభాలో 20 శాతం దళితులున్నారన్నారు. వీరంతా తమను ఎంపీలను, ఎమ్మెల్యేలను, మంత్రులను చేయాలని కోరడం లేదన్నారు. దళిత వాడలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, వెయ్యిజనాభా దాటిన ప్రతి దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కోసం ఏటా రూ.రెండు కోట్లు కేటాయించాలని కోరుతున్నారన్నారు. ఇదే విషయమై అంబేడ్కర్ ఇండియా మిషన్ తరపున ఇటీవల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని కలిసి దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేయాలని కోరడం జరిగిందన్నారు. అందుకు సీఎం జగన్ సానుకూలంగా స్పందించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కులగణన జరుగుతోందని, అది పూర్తయిన తర్వాత వెయ్యి జనాభా దాటిన దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించి నిధులు కేటాయించేందుకు అంగీకరించారన్నారు. ఇది అమల్లోకి వస్తే రాష్ట్రంలో 1500 దళిత వాడలు ప్రత్యేక పంచాయతీలు కానున్నాయన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు దళిత వాడలకు వచ్చే రాజకీయ పార్టీల నాయకులు దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేసే అంశాన్ని మీ పార్టీల మేనిఫెస్టోలో ప్రకటించాలని సునీల్ కుమార్ కోరారు. దళిత బిడ్డలంతా ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను ఇదే విషయమై డిమాండ్ చేయాలని సూచించారు. రూ.లక్ష కోట్ల బడ్జెట్ ఉంటే దళిత జనాభా దామాషా పద్ధతిలో రూ.18వేల కోట్లు దళితుల కోసం కేటాయించాలన్నారు. ఎస్సీలకు బ్యాంకర్ల గ్యారంటీ లేకుండా రుణాలు ఇవ్వాలని దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని, ప్రధాని మోదీ కూడా ఇదే పద్ధతిలో ముద్ర రుణాలు ఇవ్వాలని ఆదేశించినప్పటికీ బ్యాంకర్లు ఇవ్వడం లేదన్నారు. దళితులు ఇక నుంచి ప్రత్యేక దళితవాడ పంచాయతీలు సాధించుకోవడానికి పోరాటం చేయాలన్నారు. వివక్ష లేకుండా ఉండడం కోసమే దళిత వాడను ప్రత్యేక పంచాయతీ చేయాలని కోరుతున్నామన్నారు. మనకు ఏ ప్రభుత్వం మేలు చేస్తే వారికే అండగా నిలబడదామన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర నాయకులు సాకేటి విజయ్‌కుమార్, పైడికొండ శ్రీను, జాలాది విజయ, కొల్లా బత్తుల దిలీప్, జల్లు చినబాబు, మోహన్‌కుమార్, జెడ్పీటీసీలు లంక సూరిబాబు, కాకర దేవి, సర్పంచ్ గారాప్రసాద్, నియోజకవర్గ దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, నెలపర్తి అర్జున్, ఇంజరపు సూరిబాబు, పల్లా విలియం కేరి, ఐఎస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



గణపర్తి హైస్కూల్‌లో డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో రూ.32లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను ఆయన శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పలు సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎన్‌టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకోవాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, డాక్టర్ విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ నేత కాండ్రేగుల యశ్వంత్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎన్‌టీపీసీ ప్రతినిధులు, చదరం అప్పలనాయుడు, దార, సీతారామ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయం రాట మహోత్సవం



ఆలయం వద్ద పందిరి రాట వేస్తున్న భక్తులు

మునగపాక : గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కృష్ణ దేవాలయం పందిరి రాట మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. శ్రీ కృష్ణ బాలల కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేపచెట్టుకు పసుపు, కుంకుమ పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాశీబాబు, ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణ, శ్రీనివాసరావు, కర్రి కోటి, కాండ్రేగుల మణికంఠ, రామునాయుడు, గణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన



చినగుమ్ములూరులో ఈవీఎం ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : సార్వత్రిక ఎన్నికల ముందు ఈవీఎం మిషన్ల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే తీరు ప్రతి ఒక్కరికీ తెలియాలని డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్ అన్నారు. పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, చినగుమ్ములూరు గ్రామాల్లో నాలుగు పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎం మిషన్లు నేరుగా బూత్‌లకు తెచ్చి అందుబాటులో ఉన్న ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకునే తీరును వివరించారు. వచ్చే ఎన్నికల్లో తడబడకుండా ఓటు హక్కును నచ్చిన వారికి వేసుకునే విధానం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో చినగుమ్ములూరు సర్పంచ్ గాడి అప్పల నరసింహ, వీఆర్వో సంఘ అధ్యక్షుడు నూకరాజు, స్థానిక వీఆర్వోలు సాంబ, ప్రసాద్, బీఎల్‌వోలు ఉన్నారు.

అక్రమ మద్యం కేసులో ఒకరి అరెస్ట్

రాంబిల్లి: అక్రమంగా మద్యం తరలిస్తున్న కేసులో కొత్తపట్నంకు చెందిన ఓ వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు. అక్రమంగా మద్యం విక్రయించినా, తరలించినా కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమ మద్యం తరలింపు, విక్రయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. గ్రామాల్లో అక్రమ మద్యం తరలింపు, అమ్మకాలపై గట్టి నిఘా పెట్టామన్నారు.

చెరువు నుంచి అక్రమంగా నీరు తోడితే కఠిన చర్యలు



గుర్రాజుపేటలో చెరువు గట్టును పరిశీలిస్తున్న నీటి పారుదలశాఖ అధికారులు

ఎస్.రాయవరం : నీటిపారుదల శాఖ చెరువుల్లో విద్యుత్ కనెక్షన్లు పెట్టి నీటిని తోడితే చర్యలు తప్పవని నీటి పారుదలశాఖ డీఈఈ జగదీశ్వరరావు అన్నారు. గుర్రాజుపేట చెరువులో అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని, చెరువు గట్టు ధ్వంసం చేస్తున్నారని ఆయకట్టు రైతుల ఫిర్యాదు మేరకు శనివారం ఇరిగేషన్ అధికారులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. చెరువుకు సమీపంలో ఉన్న భూస్వాములు పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటారు కనెక్షన్లు, మోటార్లు అక్రమంగా చెరువు వద్దకు మార్చుకుని నీటిని తోడుకోవడం తరచూ జరుగుతోంది. ఆ క్రమంలో కొందరు రైతులు ఇటీవల పెద్ద చెరువుగట్టును పొక్లెయిన్‌తో తవ్వి పైప్‌లైను ఏర్పాటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు మేరకు డీఈఈ పరిశీలించి చర్యలు చేపట్టారు. అక్రమంగా గట్టు తవ్విన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏ చెరువులో అయినా నిబంధనలకు విరుద్ధంగా నీటి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో డిఈఈ వెంట ఏఈ చిన్నారావు, నీటి పారుదలశాఖ సిబ్బంది ఉన్నారు.

అచ్యుతాపురంలో రియల్టర్ల ఆగడాలు

- ఇరువాడ రెవెన్యూ పరిధిలో అనధికార లేఅవుట్
- లోకల్ ఫండ్ రోడ్డును కప్పేసిన వైనం
- ప్రశ్నించిన వీఆర్‌ఓకు బెదిరింపులు
- స్థానిక చెరువుకు నీరు ఎలా వెళ్తుందంటున్న గ్రామస్తులు



రియల్టర్లు కప్పేసిన లోకల్ ఫండ్ రోడ్డు ప్రాంతం

అచ్యుతాపురం : పూర్వీకులు వాడే రహదారి అది. రికార్డు పరంగా లోకల్ ఫండ్ రోడ్డు. విస్తీర్ణం 6.54 ఎకరాలు. ఎగువ ప్రాంతంలో ఉన్న కొండపై పడే వర్షం క్రమ క్రమంగా ఈ రోడ్డు మీదుగా వెళ్లడంతో కొండగెడ్డగా మారింది. కొండగెడ్డ మీదుగా సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులోకి వర్షం నీరు వెళ్లేలా మారింది. భూముల ధరలు విపరీతంగా పెరగడంతో అచ్యుతాపురం మండలంలోని శివారు గ్రామాల్లో సైతం లే అవుట్‌లు పుట్టుకువస్తున్నాయి. అటువంటి అనధికార లేఅవుట్ ఒకటి కొండగెడ్డను మింగేస్తోంది. ఇరువాడ రెవెన్యూ పరిధిలో రహదారికి సమీపంలో గల ఈ లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవు. కనీసం ల్యాండ్ కన్వర్షన్ కూడా జరగలేదు. వారం రోజుల క్రితం రాత్రి వేళల్లో అచ్యుతాపురం–పరవాడ రహదారికి మధ్య ఉన్న కొండగెడ్డ(స్థానికుల భాషలో) లోకల్ ఫండ్ రోడ్డును సుమారు 40 సెంట్ల విస్తీర్ణం మేరకు అనధికార లేఅవుట్ యజమానులు కప్పి వేశారు. దీనిపై ప్రశ్నించేందుకు వెళ్లిన వీఆర్ఓను బెదిరించారు. ×ఉద్యోగం చెయ్యాలని లేదా..?..ఏం చేసుకుంటారో చేసుకొండి..అంటూ గదమాయించారు. అచ్యుతాపురం–గాజువాక మార్గంలోని రోడ్డుకి ఆనుకొని ఉన్న ఈ లోకల్ ఫండ్ రోడ్డుని ఎవరూ వినియోగించడం లేదు. కొండ ప్రాంతం నుంచి వస్తున్న నీరు దిగువ చెరువులోకి వెళ్లిపోవడంతో తుప్పలు కూడా పెరిగిపోయాయి. రాత్రి వేళల్లో మట్టిని కప్పుతున్నారని తెలుసుకొని వెళ్లిన కొందరు గ్రామస్తులకు కూడా సరైన సమాచారం ఇవ్వలేదు. ప్రైవేట్ స్థలంలోని మట్టిని తొలగిస్తే నేల– నీరు–చెట్టు చట్టం, వాల్టా చట్టం ఉల్లంఘించినట్లే.!

స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం..

ఈ అనధికార లే అవుట్ అంశంపై ప్రశ్నించగా తహశీల్దార్ వివరణ ఇస్తూ, తాను ఇటీవల బదిలీపై వచ్చానని తెలిపారు. తమ వీఆర్‌ఓను బెదిరించినట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. దీనిపై పరిశీలన జరిపి ఎల్ఎఫ్ఆర్‌గా నమోదైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని, పరిస్థితుల బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిలో భాగంగా ఆమె లే అవుట్ ప్రాంతాన్ని శుక్రవారం సాయంత్రం పరిశీలించినట్టు సమాచారం.

శ్రీ కృష్ణుని విగ్రహ ప్రతిష్ట పోస్టర్ ఆవిష్కరణ



విగ్రహ ప్రతిష్టకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : మునగపాకలో ఈ నెల 22న శ్రీకృష్ణ దేవుని విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు పాటుపడాలి



రక్షిత సాయనార్ గ్రూప్ డైరెక్టర్ దొరబాబును సత్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక : విద్యా ప్రమాణాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక దళితవాడలో ప్రాథమిక పాఠశాల–2 అభివృద్ధికి రూ.2 లక్షల మేర నిధులు కేటాయించిన రక్షిత సాయనార్ గ్రూప్ డైరెక్టర్ దొరబాబును శనివారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ముగ్గురు విద్యార్థులు ఉన్న స్కూల్‌ను 30 మంది వరకు పెరిగేందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు దుర్గా ప్రసాద్ సేవలను అభినందించారు. ప్రభుత్వం కూడా విద్యాభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటుందన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. రక్షిత సాయనార్ గ్రూప్ డైరెక్టర్ దొరబాబు మాట్లాడుతూ దళితవాడలో పాఠశాల అభివృద్ధికి తన వంతు సాయం అందజేస్తామన్నారు. ఉపాధ్యాయుడు పెంటకోట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కాశీబాబు పాల్గొన్నారు.

సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యత్వ నమోదు



గొర్లె ధర్మవరం రామాలయంలో ధర్మ ప్రచారం చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని గొర్లె ధర్మవరంలో శనివారం సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. యలమంచిలి ఖండ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఎస్ఎఫ్ఎస్ సభ్యులు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండపాక లక్ష్మణరావు, గొర్లె సత్తిబాబు, గొర్లె అర్జున్, సంజీవ్, పూడి గణేశ్, గొర్లె కుమారి, తేటకాల రాము, గొర్లె వెంకటి పాల్గొన్నారు.

ఆశాజనకంగా అపరాల పంట



నారాయణపురం సమీపంలో పెసర పైరు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల పరిధిలో సాగవుతున్న పెసర, మినుము(అపరాలు) పంట ఆశాజనకంగా ఉంది. దిమి లి, నారాయణపురం, మర్రిపాలెం, కొత్తూరు, రాజు కోడూరు, కట్టుబోలు, రజా ల, కుమ్మరాపల్లి, మురకాడతో పాటు పలు గ్రామాల పరిధిలో సుమారు 2200 ఎకరాల్లో పెసర, మినుము పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రాయితీపై పెసర, మినుములు విత్తనాలను సరఫరా చేసింది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో పెసర, మినుము మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. కొన్ని చోట్ల పూత, మరికొన్ని చోట్ల కాయ దశలో ఉన్నాయి. మూడు రోజులుగా మంచు ప్రభావంతో పంటకు నష్టం కలుగుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్కడక్కడ అపరాల పైరుపై తెగుళ్లు ఆశించడంతో రైతులు తెగుళ్ల నివారణ మందులు పిచికారీ చేస్తున్నారు. మరో పది నుంచి 15 రోజులు వాతావరణం అనుకూలంగా వుంటే మంచి దిగుబడులు రానున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.